శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురో పినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహీదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా
సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ
కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

---

సంపుటి:1 సంచిక:2 త్రైమాసిక పత్రిక మార్చి - 1998

సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!



ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన
హృదయ కుహరంలోని
నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి.
ప్రణవనాద వీచికల్లా
సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!

ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన
మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు
అంతటా నిరంతరం
వర్షించాలి! ఆ ప్రేమామృత
ధారలలో తడుస్తూ, ఆ
జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

*****************************************************************************************

ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - గురు బంధువులు | |
| 3. | గురుప్రార్థనా ఫలం | బి.సాయి శ్రీనివాస్, బోధన్ |
| 4. | సత్సంగవేదిక | జి.రత్తయ్య, తెనాలి |
| 5. | సద్గురు సన్నిధిలో | స్.హెచ్.సాంబశివరావు, తెనాలి |
| 6. | మరపురానివేళ | శ్రీనివాసరావు, తెనాలి |
| 7. | ఆరూపు - ఆచూపు - ఆమౌనం | మునగపాటి కోటేశ్వరరావు, తెనాలి |
| 8. | స్వప్నేష | డా|| సాయి వరప్రసాద్, రేపల్లె |

## ఉన్నమాట - అనుకున్నమాట

గురుదేవుల దయాదృష్టితో, ఆశీర్వాదబలంతో "గురుకృప" రెండవ సంచిక మీ ముందుకు వచ్చింది. మా పరిధులలో గురుబంధువుల నుండి సేకరించిన లీలలు, అనుభవాలు, 1998 జనవరి శిరిడీ విశేషాలు, మరియు సత్సంగ విశేషాలు ఈ సంచిక ద్వారా గురుబంధువులకు అందించగలగటం గురుకృపే. ప్రారంభ సంచిక గురుబంధువులలో మంచి స్పందన కల్గించింది. శిరిడీ "సాయియానాలో" గురుదేవుల ఆశీస్సులతో విడుదలైన "గురుకృప" ప్రారంభసంచిక గురుబంధువులందరికీ పంచటం జరిగింది. ఈనేపథ్యంలో గురువుగారితో జరిగిన సత్సంగంలో "మన ఆచరణ నలుగురికీ మార్గదర్శకంగా ఉండాలి. అలా మార్గదర్శకమైన ఆచరణీయ విషయాలే పత్రికలో ప్రచురింపబడాలి. అప్పుడే పత్రికా నిర్వహణకు అర్థం - పరమార్థం." అన్న గురుదేవుల సూచనలు మమ్మల్ని వెన్నుతట్టి దారి చూపించాయి. ప్రయత్నం చిన్నదైనా, పెద్దదైనా మంచిదైనప్పుడు, ప్రయత్నించేవారెవ్వరినన్నా ప్రోత్సాహించి ముందుకు నడిపించే గురువుగారి తీరు గురుకృపకు నిదర్శనం - గురుబంధువులకు మార్గదర్శకం.

గురుదేవుల ఆశయాలను ప్రతి సాయిభక్తునికి అందించాలన్నదే ఈ "గురుకృప" పత్రిక ఆశయం. గురుదేవుల ప్రవచనాలకు ప్రతీకగా ఈ రెండవ సంచికను రూపుదిద్దటానికి ప్రయత్నించాం. గురుదేవుల అనుగ్రహబాటలో నడయాడే వ్యక్తికి సాయికన్న మించిన దైవం లేడనిపిస్తుంది. బాబా ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆనందంగా నర్తించటం అంటే ఏమిటో అనుభవం ద్వారా తెలుసుకున్న సాయిభక్తుని చర్యలలో - ఆరాధనలలో "ఒకే దైవం - ఒకే ధ్యానం - ఒకే ధ్యేయం" అన్న భావం ప్రస్ఫుట మవుతూ ఉంటుంది. నాకు బాబాకన్నా, గురుదేవులకన్నా మించినదైవం మరొకరులేరని ఎంతోమంది మాటలలో అంటూవుంటారు. ఆ మాటలు చేతలలో చూపిననాడే అది మరొకరికి మార్గదర్శకమౌతుంది.

సృష్టిలో ఒకరిని చూసి మరొకరు చేయటం అంటే అనుకరించటం సర్వసాధారణం. బాబాను నమ్మినవారు ఎందరో ఆర్తితో తమ మనస్సును సాయిపాదారవిందాలకు అర్పించుకొని చరితార్థులవుతున్నారు. ఈ "అర్పణ" అనేది అనుకరుణ ద్వారా జరిగేది కాదు. కేవలం స్వీయ ఆచరణ, అనుభూతి ద్వారా మాత్రమే జరుగుతుంది. అయితే నేడు అంతరార్థాన్ని గ్రహించకుండానే అనుకరణ ద్వారా అనేక విషయాలు వ్యాపనై పోతున్నాయి. ముఖ్యంగా సాయిభక్తులమని చెప్పుకొనేవారు కూడా కొందరు మ్యారేజి, గృహప్రవేశ కార్డులు ప్రింటింగ్ విషయాలలో ఈ "అనుకరణ" మార్గం నుండి బయటపడలేకపోతున్నారు.

సాయిబాటలోకి, గురుపథములోకి వచ్చిన కొందరు గురుబంధువులు గురువుగారు అభిప్రాయాలను సరిగా అర్థము చేసుకోలేక "బాబా మరియు బాబూజీ ఆశీస్సులతో" అని ఆహ్వాన పత్రిక ప్రారంభించి "శ్లోకాలు, ముహూర్తాలు, బంధుమిత్రుల అభినందనలతో" ఇత్యాది విషయాల్లో సంప్రదాయ అనుకరణకు దూరం కాలేకపోతున్నారు. బాబా, గురువుగారిపై పూర్తిగా ఆధారపడినవారు ఈ డోలాయమాన స్థితి నుండి బయటపడటం అవసరం, "సాయి భక్తులమైన మనం చేసే ప్రతి పని, ఇంకొకరు తెలుసుకొని ఆచరించేటట్లు ఉండాలి" అన్నది గురువుగారి సూక్తి సుధలోని ఒక సుధాబిందువు. ఆ బిందువులోని భావాన్ని అర్థం చేసుకోవటమే కాకుండా, ఆచరణలో కూడా చూపించిన ఒక గురుబంధువు గృహ ప్రవేశ ఆహ్వాన పత్రిక నమూనాను ఈ సంచికలోనే తిలకించండి. ఆలోచించి, అవగతం చేసుకొని మనము కూడా ఆచరిస్తే గురుకృపకు పాత్రులము కాగలము.

## "గురు ప్రార్థనా ఫలం"

"నా ఖజానా తాళం చెవి నీ చేతిలో పెట్టాను. నీకేమి కావాలో కోరుకో ఇస్తానని" రేగే నుద్దేశించి బాబా అన్నారు.

"జన్మ జన్మలకు మీరే నాకు తోడుండాలని" వివేకంతో రేగే ప్రార్థించాడు.

"తప్పక ఉంటానని" బాబా వీపు తట్టారు. ఆ కారణంగా రేగేకు ఎప్పుడు బాబా తనకు దగ్గరగా ఉన్నట్లుగానే ఉండేది.

మరొకసారి "రేగే" బిడ్డ చనిపోయినప్పుడు "నీకు బిడ్డకావాలా! నేను కావాలా! బిడ్డకావాలంటే బ్రతికిస్తాను. దానివల్ల మన కెలాంటి సంబంధము ఉండదు. నీకింకా బిడ్డలు కల్గుతారని 'బాబా' అన్నారు.

అంతటి తీవ్ర దుఃఖములోను బాబాను "రేగే" కోరిందేమిటి? నాకు మీరే కావాలని అన్నాడు. బాబాకు "రేగే" అంతగా సన్నిహితుడు కావటానికి కారణం పూర్వజన్మ సంబంధమైన ఋణానుబంధమే. ఎవరైతే "నాసర్వస్వము బాబా" అని భావించి శరణాగతి చెందారో వారిని బాబా ఎన్నడూ వదలలేదనే విషయం మనకు అవగతమౌతుంది.

ఎవరైతే బాబాకు ఇష్టమైన పనులు చేస్తారో, "బాబా" కార్యక్రమాలలో విరివిగా పాల్గొంటారో! వారందరికి గురుదేవులు డా|| సాయినాథుని శరద్బాబూజీ ఆశీర్వాదము అనుగ్రహము లభిస్తాయి. ఇలాంటి అనుభవాలు మాగురు బంధువులలో కోకొల్లలుగా ఉన్నాయి. "బాబాను" ప్రార్థిస్తే గురుదేవుల వద్ద సమాధానము, లేదా కోరికలు తీరిన సందర్భాలున్నాయి. ఈ విషయంగా నా అనుభవమును గురుబంధువులకు తెలియజేయాలని ఉత్సాహపడుతున్నాను.

1998 జనవరి 1వ తారీకున నేను శిరిడీలో ఉన్నాను.

గురువుగారితో చాలాసేపు మాట్లాడాలని, వారి ముందు బాబా నామం చెప్పాలని, వారి పాదలకు సేవ చేయాలని అట్టి భాగ్యోన్నతి కలగాలనే కోరిక నాకుంది. గురువుగారిని సేవించాలనే కోరిక నానాటికి బలీయమైపోతోంది. ఏంచేయాలో నాకు తెలియదు కాని నాకోరిక తీరాలి! ఎలా? తెలియకుంది.

శిరిడీలో ఉన్నరోజుల్లో ఎక్కువగా రాత్రిపూట గురుస్థానము వద్ద, మధ్యాహ్నం 2.30 దాటిన తరువాత సమాధి మందిరంలో బాబాను చూస్తుండి పోయాను. ఒక్కోసారి బాబా చరిత్రను పారాయణం చేసేవాడిని.

సమాధి మందిరంలో బాబా విగ్రహం ప్రక్కన పడివున్న కాగితాలను, పూలను ఊడ్చి, శుభ్రం చేసేవాడిని. ఇలా కొద్దిరోజులు గడిచి పోయాయి. నా ప్రార్థన బాబాకు విన్నవించుకొన్నాను. నా ఆలాపన బాబా చెవికి సోకింది. అంతే ఆ రోజు రాత్రి నన్ను గురువుగారు "సాయి యానాలో" సత్సంగం పూర్తైన తరువాత నన్ను పిలిపించారు. నాకు కావల్సిన నా కోరిక నెరవేర్చారు. నాకు కావాల్సింది గురువుగారు ఇచ్చివేస్తున్నారు.


నేను గురుస్థానంలోగాని, సమాధి మందిరంలోగాని బాబాను అడిగిందంతా, సాయంత్రం గురుదర్శనానికి వెళ్ళినప్పుడల్లా గురువుగారు తీర్చేస్తున్నారు. నాకు కలిగిన సందేహాలకు సమాధానాలిచ్చి సంతృప్తి పరచేవారు.

గురువుగారికి దగ్గర కావాలనుకొనేవారు "బాబా"కు ఇష్టమైన రీతిలో నడుస్తుంటే గురుదేవుల అనుగ్రహం లభిస్తుంది.

శ్రద్ధగా సమయానికి సత్సంగాలకు వెళ్ళడం, ఆర్తితో నోరారా "బాబా" నామాన్ని పలకడం, భజనలో పాల్గొనడం, ఖాళీ సమయంలో సద్గ్రంథ పఠనం (బాబాకు సంబంధించినవి) శ్రద్ధగా చేయాలి. చదివిన విషయాలను మననం చేసుకొని, వాటిని ఆచరణలో చూపాలి. కాలక్షేపపు కబుర్లు సత్సంగందాకా మోసుకువచ్చి అక్కడ ముడి విప్పకుండా ఉండడం. "బాబా" కార్యక్రమాలలో సాధ్యమైనంతవరకు పాల్గొనడం మొదలగు వాటిద్వారా సమయాన్ని సద్వినియోగపర్చుకుంటే బాబాకు, గురువుగారికి అతి సన్నిహితులమౌతామనేది నా అనుభవం.

నియమంగా సత్సంగానికి వెళ్ళేవారికి ఈ విషయాలు తెలుసు. సత్సంగంవల్ల మనకు తెలియకుండానే మనలో ఎంతో మార్పు వస్తుంది. అలా కల్గిన ఈ మార్పు సత్సంగము వల్ల కల్గిందను విషయాన్ని మనం గుర్తించలేక పోతున్నాం. సత్సంగ మహిమను గూర్చి "సత్సంగత్వే నిస్సంగత్వం! నిస్సంగత్వే నిర్మోహత్వం|| నిర్మోహత్వే నిశ్చల తత్వం ! నిశ్చలతత్వే జీవన్ముక్తిః|| అని శంకర భగవద్పాదులన్నారు. సత్సంగాలకు వెళ్ళిన తరువాత మనకు తెలియకుండానే గురుదేవులు ఎంతో మార్పు తెస్తున్నారనేది నా అనుభవం. మీకు గూడా అలాంటి అనుభవం రావాలని కోరుతున్నాను.

B. సాయి శ్రీనివాస్ M.A
బోధన్(Bodhan)



## సత్సంగవేదిక

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనేది అందరికి తెలిసిన సత్యం, అలాగే, అవతార పురుషులు అవధూతలు, మహిమాన్విత సాధకులు, తమ చిన్నతనం నుండి సత్యాన్వేషణ వైపు, తమ మనస్సును ప్రయాణింపచేస్తారు. గౌతమ బుద్ధుడు, రమణ మహర్షి, వివేకానందుడు, తమలోని శక్తులు ద్విగుణీకృతం కాగా, ఆధ్యాత్మిక ప్రపంచంలో ఒక స్థానాన్ని పొందటం మనకు విదితమే. అదే కోవలో నేడు మన మధ్య కదలాడే దైవంగా, వరములిచ్చే వేల్పుగా, ఒక శక్తిగా, ప్రకటితమైన మన గురుదేవులు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీకి అతి చిన్న వయస్సునుండి గడ్డం పెంచుకొన్న ప్రతివారిని దైవం గురించిన ప్రశ్నలతో వేధించటం పరిపాటి అయింది. ఆ దారిలో ఒక గంధపు చెట్టు శ్రీ మాష్టారు. వారి శిష్యత్వంలో సాయి బాటపైన అడుగిడి, ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వారి నిర్యాణం తర్వాతవారు వదిలిన తత్వాన్వేషణను వదలక, సాయిధ్యాసలో అలుపు ఎరుగక, నిరంతరం, ఒకే దైవం, ఒకే ధ్యానం, ఒకే ధ్యేయంగా పయనిస్తూ, నేడు ఎందరికో సద్గురువైనారు.

తరచు గురుదర్శనం చేసుకొనడం అభిలాషణీయంగా తలచి జనవరి 1వ తేదీ నుండి 6వ తేదీవరకు అచ్చటి మధుర క్షణములను గురుసన్నిధిలో సత్సంగములలో పాల్గొని వారి భాషణాలను నా పరిధిలో కొన్నిటిని తెలియచేస్తున్నాను. వారు చెప్పిన దానిలో భావం ప్రధానంగా వ్రాయటం జరిగింది. యధాతంగా కాదు.

నేడు వారి దర్శనం కోసం దేశం నాలుగు పైపులనుండి వచ్చే అసంఖ్యాక గురుబంధువులకు, సాయియానాలో, ఒక రేకుల షెడ్, సత్సంగ వేదికగా జనవరి ఒకటికి పూర్తి చేయటం జరిగినది, తగురీతిగా గురుబంధువులు అందరూ వచ్చిన ఒకటవ తేదినే మంచిదిగా భావించి అతి సహజంగా, బాబా నామం చెబుతూ, సత్సంగం మొదలు పెట్టారు.

"మనకు అనువుగా వున్న వైపే మంచివైపు, పని పూర్తి అయినరోజే మంచి ముహూర్తం, నలుగురు కలిసిన రోజే మంచి తిథి," అనేదే వారి విశ్వాసం.

బాబాకు శరణాగతి అయిన వారికి ఏ శాస్త్రము గురించి చింతలేదు.

"శాస్త్ర ప్రకారం ఏమీ తెలియకపోయినా, బాబా బిడ్డలమయిన మనకు వాటి వలన ఎలాంటి సమస్యలు రావు. చేస్తే ఎంత లాభమో, చేయకపోయినా మనకు బాబా అంతే లాభం ఇస్తారు" అనేది మనకు ఎరుకలోకి రావలి అదే సాయిసాధనా రహస్యం

జి. రత్తయ్య, తెనాలి.

## సద్గురు సన్నిధిలో

ఓం సాయినాథాయనమః!

సృష్టికి మూలం శ్రీసాయిబాబా, ఈ సర్వజగత్తును నడిపించేది, శాసించేది బాబాయే. ఆ సర్వోత్కృష్టుని సృష్టిలో భూమి, ఆ భూమిపై మానవులు. సైన్స్ ప్రకారం ఈ మానవులు పరిణామదశలో అనేక మార్పులు. అనేక అనుభవాల ద్వారా ఎంత ప్రగతి సాధించామనే అహం.

మరి ఎన్నో యుగాల నుండి ఎంత అనుభవం గడించినా ఎంత విజ్ఞానం పెరిగినా మనిషిని మనిషిగా ఎందుకు చూడటంలేదు? రెండు వర్గాలుగా ఎప్పుడూ విడిపోయి ఉంటున్నారు. అంటే తెలివిగలవాడు, తెలివిలేనివాడు. బలం కలవాడు,లేనివాడు, ధనం కలిగినవాడు, లేనివాడు ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇదీ ప్రశ్న!


మన సద్గురువు అయిన శ్రీసాయినాథుని శరత్ బాబూజి సమక్షంలో ఈ ప్రశ్నను వేయటం జరిగింది. ఆ సత్సంగంలో మన గురుబంధువులతో పాటు ఇతర దేశాల నుండి వచ్చిన గురుబంధువులు కూడా వున్నారు. అప్పుడు గురువుగారు ఇంగ్లీషులో నేను వేసిన పై ప్రశ్నను తిరిగి ఇతర దేశాల గురుబంధువులకు వేసి "ఆలోచించండి" ఇలా రెండు రకాలుగా బాబా ఎందుకు సృష్టిస్తున్నారు? ఆలోచించి చెప్పండి అన్నారు. ఎవరికితోచిన రీతిలో వారు తమ అభిప్రాయాలను ఇంగ్లీషులో చెప్పారు. కానీ ప్రశ్నకు సమాధానం మాత్రం సరిగ్గా తేల్చలేకపోయారు.

అప్పుడు గురుజీ ఒక ఉదాహరణ ఇంగ్లీషులోను, తెలుగులోను చెప్పారు. ఒక కథా రచయిత కథ వ్రాస్తున్నాడు అంటే ఎన్నో పాత్రలను సృష్టించాలి. హీరో, విలన్, హీరోయిన్, హాస్యగాడు ఇలా ఎన్నో రకాల పాత్రలను సృష్టించి కథ వ్రాయాలి. అలాగే ఒక సినిమా తీయాలంటే, తెరమీద చూపాలంటే ఎన్నో పాత్రలు కావాలి, నవరసాలను పండించాలి. ఒకే విధంగా సినిమా తీస్తే ఎవరు చూస్తారు? ఉదాహరణకు ఏడుపుగా మొత్తం సినిమా తీస్తే మనం చూస్తామా? చూడం. కాబట్టి ఏ సినిమా తీసినా, ఏ కథ వ్రాయాలన్నా రకరకాల

పాత్రలు రకరకాల సన్నివేశాలు కల్పించి తీస్తే రక్తికడుతుంది. ఇలా చాలాసేపు గురుజీ చెప్పారు. సమాధానం సూటిగా చెప్పకుండా గురుబంధువులందరికి ప్రశ్నవేసి ఆలోచించమన్నారు. ఈ ప్రశ్ననే గురుజీ చిన్నప్పుడు గడ్డం వున్న ప్రతివాడిని అడిగి వేధించేవారట.

అంటే మన గురూజీ అప్పటి నుండే ఎంత జిజ్ఞాసపరులో ఆలోచించండి. దీన్నిబట్టి ఆలోచిస్తే తేలిందేమిటంటే మన గురుజీ చెప్పిన ఉందాహరణలోనే సమాధానం దొరుకుతుంది అని.

ఈ సృష్టిని నడిపించేది శాసించేది బాబాయే అయినప్పటికి ఆయన నీకిచ్చిన జ్ఞానం, వివేకంతో సత్ ప్రవర్తన కలిగి సర్వజీవాళికి ఉపయోగపడేలా చేస్తేనే ఈ మానవ జన్మకు సార్థకత. మరి అది మనందరం చేస్తున్నామా? చేయగలుగుతామా? ఈ భవబంధాలలో చిక్కి, అనేక స్వార్థ ఆలోచనలతో అహంకారాన్ని పెంచుకొని, దానికి తోడు, కామక్రోధాదులను పెంచుకొని ఆ బాబా మనకిచ్చిన జ్ఞానాన్ని మరచి మనకు మనమే సినిమా కథల్లో మాదిరిగా విలన్ పాత్రలగా వ్యవహరిస్తున్నాము. అహం నుండి బయటపడలేక దానికి బానిసలమై సతమతమవుతూ ధన వ్యామోహంతో, ఏదేవుడైతే మనకు డబ్బిస్తాడో ఆ దేవుణ్ణి కొలిచి, ఆయన ఇవ్వకపోతే ఇంకో దేవుణ్ణి వెతుక్కొని అసలైన ఆనందాన్ని మరచి దేనికో ఇంకా ఏదో కావాలనే తపనతో, ఆశతో మానవుడు జీవిస్తున్నాడు. సినిమాలో కాని, కథల్లోకాని చివరకు చూసే నీతి ఏమిటి అంటే అందరం కలిసి బాగుండాలని. విలన్ కూడా మంచివాడుగా మారిపోవటం, లేకపోతే చేసిన తప్పుకు శిక్ష అనుభవించటం. అలాగే బాబా భక్తులమైన మనం తెలుసుకోవలసిందేమిటంటే సద్గురు సన్నిధి చేరిన తరువాత బాహ్యవాంఛలను విడనాడి "సర్వం బాబాయే" అని ఎరిగి "సర్వజీవులయందు బాబా ఉన్నాడు, సర్వమతసారం బాబాయే" అని నమ్మి ఆరాధించాలి. ప్రతిక్షణం బాబా నామం ఉచ్చరిస్తూ, ఏది చేసినా బాబాయే అని, బాబా ఇస్తున్నారు కాబట్టే మీరంతా బాబా ప్రసాదంగా నా వద్దకు వస్తున్నారని, ఆ కారణం చేతనే మీకు ఆనందాన్ని పంచగలుగుతున్నానని చెప్పే సద్గురువు మన శ్రీ సాయినాథుని శరత్ బాబూజి. ఆ సద్గురు సన్నిధిలో గడపగలగటం మనందరి అదృష్టం.



సర్వేజనా సుఖినోభవంతు

సి.హెచ్. సాంబశివరావు, తెనాలి.

## మరపురాని వేళ

నేను కుదరవల్లి శ్రీనివాసరావుగారి ద్వారా ప్రభావితుడినై బాబా తత్వము వైపు గురువుగారి మార్గములో నడపబడుచున్న బుర్రిపాలెం సత్సంగమునకు వెళ్ళుతూ, ప్రతి గురువారం చావడి ఉత్సవము, శనివారం సత్సంగంలో పాల్గొంటు రెండు నెలలకే నేను గురువుగారి దర్శనము చేసుకొనటానికి తిరుపతికి గురుబంధువులతో వెళ్ళినాను. నేను బయలుదేరుతున్నానని తెలిసి నా మిత్రులు కూడా నా వెంట వచ్చినారు. దర్శన నిమిత్తం అందరూ క్యూలో నిలబడగా నాకు చాలా ఆనందము కలిగింది. ఇంత త్వరలో నాకు గురుదర్శనం లభిస్తున్నందుకు హృదయం ఒకవిధమైన బరువుతో కళ్ళవెంటనీరు ఆగటం లేదు. (క్రొత్తగా వచ్చిన ప్రతివారికి ఇంతే అనుకోవచ్చు) దర్శనం దగ్గిర అవుతున్న కొద్ది నాకు యింకా కళ్ళనీరు పెరుగుతున్నది. అలా వారి దర్శనం నేను, నా మిత్రులు ఎంతో ఆనందంతో చేసుకొనటం ఇప్పటికి మరవలేను. మరి గురువుగారి దర్శనం శిరిడీలో చేసుకొనే భాగ్యం కోసం నేను ఎదురు చూస్తున్నాను. వారి పిలుపు ఎప్పుడు వస్తుందో.

శ్రీనివాసరావు, తెనాలి.

# ఆరూపు - ఆ చూపు - ఆ మౌనం

శ్రీ సాయిబాబా గురించి ఏమీ తెలియకుండానే అద్భుతమైన ప్రశాంతత ఆవహించి ఆ సచ్చిదానంద సమర్థ సద్గురువును ఆశ్రయించాలని అనిపించింది.

అలాగే శ్రీసాయినాథుని శరత్ బాబూజీ గురించి ఏమీ తెలియకుండానే ఆయన నాకు మార్గదర్శకత్వం వహించగలడని అనిపించింది.

ప్రతీది ప్రశ్నించి, అన్వేషించే అలవాటు వలన, 1993లో మారీసుపేట శ్రీదత్తసాయి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం విచ్చేసిన శ్రీ శరత్ బాబూజీని పరిశీలనగా చూశాను.

ఆరోజు తెనాలి రైల్వే ప్లాట్ ఫారం మీద శ్రీసాయి బాబా భక్తుల కోలాహలంలోంచి శరత్ బాబూజీ వచ్చి కారులో కూర్చొన్నారు. అక్కడ నిలబడి ఆయన వంక చూస్తూ నుంచున్నాను. ఆయన నా వంక నాలోకి చూస్తున్నారు. ఆ తర్వాత దత్తసాయి ఆలయంలో గదిలో గంటకు పైగా శ్రీ శరత్ బాబూజీని చూస్తూ కూర్చున్నాను. ఇంకా సమయముంది అన్న సంకేతం నాకనిపించింది.

ఆ తర్వాత షిరిడీలో సాయిపథంలో రెండు సార్లు దర్శించుకున్నాను. రెండుసార్లు అద్భుతమైన మౌనతరంగం నన్ను ప్రశాంతంలో వుంచింది. ఒకసారి మామిడిపండు, ఒకసారి భోజనం ప్రసాదంగా లభ్యమయ్యాయి.

తిరుపతిలో బాబూజీగారి దర్శనం నన్ను ఓదార్చింది.

ఏది ఏమైనా నిరంతర ఘర్షణలో ప్రతి సాధారణ కుటుంబీకునికి వుండే అశాంతిలోంచి సద్గురు సన్నిధి ప్రశాంతతని కలుగ చేస్తోంది.

ఆ నిలకడ, ప్రశాంతతే ఆత్మ దర్శనానికి మార్గదర్శకత్వం కలిగిస్తుందని, ఆ సందేశమే శరత్ బాబూజీ నుంచి నిరంతర తరంగంలా నన్ను ఆవహిస్తోందని నమ్ముతున్నాను.

ఆరూపు, ఆచూపు ఆ మౌనమే శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ నుంచి నాకు లభ్యమైన అనుభవం. అదే నిరంతర అనుభూతి కావాలని సదా ఆ సద్గురు కృప నన్ను వెన్నంటి వుండాలని శ్రీసాయినాథుని కరుణకు నన్ను అర్హునిగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నాను.

మునగపాటి కోటేశ్వరరావు, తెనాలి.

# "స్వప్నేష"

తపన, ఆర్తి, ఉత్సాహముల కలయిక త్రివేణి సంగమ వాహినిలా పెల్లుబికిన వైభవమే "సద్గురు సాయినాథుని సత్సంగ సదస్యుల సప్తమ వార్షికోత్సవ మహోత్సవము. 11-1-98న సప్తమ వార్షికోత్సవ కార్యకలాపములకు ఉదయశంకర కళ్యాణ మండపము వేదికయై వెలుగొందినది.

గుంటూరు పట్టణమునకు గురుదేవులు అరుదెంచిన రోజున తెనాలి ప్రాంతములో "సత్సంగ కార్యక్రమము" నిర్వహించుకొనుటకు మీ ఆశీర్వాదము, మీ ద్వారా బాబా అనుమతిని ఇప్పించమని అర్థించినాము. అడిగిన వారికి లేదనకుండా అనుగ్రహించటమే ఆ మహనీయుని పని. ఆశీర్వదించి స్వయముగా రెండు "సాయిపథం" వ్యాసాలు ముద్రించిన బైండింగ్ పుస్తకాలు "బాబా ఆశీర్వచనము మీకు కలగాలనే ఆటోగ్రఫీ" వ్రాసి ఇచ్చారు.

1992లో గురుదేవుల దివ్యాశీర్వాదముతో తెనాలిలోని, రామలింగేశ్వరపేటలో సాయిబాబా మందిరంలో ఆరంభించబడినది. ఆనాటినుండి ఈనాటి వరకు ప్రతి ఆదివారం సా|| 3గం||లకు ఇక్కడ సత్సంగ కార్యక్రమము నిర్వహించుచునే యున్నారు. గుంటూరు జిల్లాలో వెలసిన మొదటి సత్సంగ కేంద్రమిదే. ఆ తరువాత అనేక సత్సంగాల ఆవిర్భావనకు ఇదే మూల కేంద్రమైనది. మొదటి సంవత్సర సత్సంగ ఫలితమా అనునట్లుగా నడయాడే దైవం గురుదేవులు సాయిపూజా మహోత్సవాలను తిలకించుని మిత్తమై తెనాలికి మొదటిసారిగా సాయిబాబా మందిరంలోకి అంటే సత్సంగ ప్రదేశానికి వచ్చారు. సాయిసత్సంగ సదస్యులు చేయు సాయి పూజా మహోత్సవాలను చూచేందుకు మమ్మందరిని సంతృప్తి పరచి ఆశీర్వదించు విషయముగా తెనాలికి గురుదేవులు వస్తే శిరిడీ క్షేత్రమే ఆనాడు తెనాలికి తరలి వచ్చిందా అని నాటి సందర్శకులు పలు ప్రాంతములందు పలికిన పలుకులు శ్రవణ పేయంగా మా సదస్యులకు వినిపించినవి. గురుదేవులు ఆనాడు గుంటూరులో ఉట్టంకించిన మాటలన్నీ వారి మహా ప్రభావము వలన అనతికాలములోనే వాస్తవములైనవి. ఈ ప్రేరణే ఎన్నో సత్సంగ కేంద్రాలు వెల్లివిరియుటకు మౌలికమైన కారణమైనది.


ఈ సందర్భంగానే "స్వప్నేష"ను గూర్చి విన్నవించుకోవాలి! ఇది ఓ సాధకుని కల. ఓనాటి ఆరాటము. ఆనాటి దానికి రూపాంతరమే "సత్సంగమేళ" ఆవిర్భావానికి పునాది. ఈ పునాదిపై పెల్లుబికిన ఉత్సాహమే, సప్తమ వార్షికోత్సవ వైభవము. ఒకదానికొకటి అవినాభావసంబంధంగా పెనవేసుకొనినవి.

రామలింగేశ్వరపేటలోని బాబా మందిరం నుంచి అద్భుతమైన ఊరేగింపు. వందలాది గురుబంధువులంతా బాబానామ ఉచ్చై స్వరములో పల్కుతున్నారు. మహిళలు కుడివైపు, పురుషులు ఎడమవైపు, వీరికి ముందు ఎఱ్ఱని దుస్తులు, తలకు టోపీలు ధరించిన ఫుల్ బ్యాండ్ మేళము వాయించేవారు 30 మందికి పైగా ఉన్నారు. వెనుక భాగాన, గురుజీ, వారిపైభాగాన బాబా చిత్రపటాలను అందంగా అలంకరించబడిన వాహనము. గ్రీష్మతాపము నివారించు ఛత్రము. పూలమాలలు స్పష్టంగా కన్పించినవి. గురుబంధువుల చేతిలో బ్యానర్స్ ఉన్నవి. అందులో ఒక బేనరు మీద "సత్సంగమేళ" అన్ననామాక్షరాలు విపులంగా పొడగాంచినవి. ఈ ఊరేగింపు దాదాపుగా 1 కిలో మీటరు వరకు వ్యాపించి ఉంది. కోలాటము ఆడేభక్త బృందము ఊరేగింపులో ఉన్నారు. కలమాయమైపోయినది. ఇదంతా గురుదేవుల "హంతోక్తి" అని సాధకుని మనసులో ముద్రపడినది. ఈ సన్నివేశమును గురుదేవులు ప్రబోధించిన, లేదా సూచించిన నామ

మంజరిగా భావించి ఏంచేయలో! ఎలా చేయాలో! ఆలోచనలోపడి తన మనోగతాభిప్రాయమును ఉత్తరము ద్వారా "గురుచరణ సన్నిధికి" సమర్పించుకోవటమైనది. ఏతత్ఫలితముగా ప్రతిరోజు సత్సంగ కార్యక్రమమును నిర్వహించుకోవాలనే భావనకు బలమైన ఆధారమును శ్రీమతి పి. విజయలక్ష్మిగారు కల్పించినారు.

పవిత్రమైన పర్వదినము దసరా. ఆరోజునే మాగురూజీ జన్మించిన రోజు 1996 అక్టోబరు 21తా|| మధ్యాహ్నం 12 గం|| "శరచ్చంద్రిక సదనము" లో "సద్గురు సాయినాథుని సత్సంగమేళ ఆవిర్భవించినది. నిర్విరామముగా ఒక్క సంవత్సర కాలము సాగి, అనంతరము అవ్యవధానము లేకుండా గురుబంధువు శ్రీమునెయ్యగారింటిలో ప్రస్తుతము ప్రతిరోజు 6గం|| నుంచి 8గం|| వరకు సత్సంగ కార్యక్రమము కొనసాగుతునే వున్నది.

ఇంతలో జనవరి రానే వచ్చినది. బాబా మందిరంలో ఏర్పాటుచేసిన సత్సంగ కార్యక్రమము ఆరువర్షములు ఆనందముగా అధిగమించి ఏడవ వార్షికములోనికి అడుగుడినది. ఆనాటి "స్వప్నేష" ఫలించే సమయమాసన్నమైనది. సప్తమ వార్షికోత్సవ విషయమును గురుదేవుల సన్నిధిలో "శిరిడిలో" వారికి నివేదించి ఆశీర్వాదమును, అనుమతిని పొంది బాబాకు ఆ విషయమును మనవి చేసుకొని కార్యక్రమములకు శ్రీకారము చుట్టినాము.



ఇటు సత్సంగమేళ, అటు సత్సంగ కేంద్రాలు ఇందులో పాల్గొనవలెనను భావన జనించగా తెనాలి పరిసర ప్రాంతాలైన, బుట్టిపాలెం, అంగలకుదురు, జాగర్లమూడి, ఆలపాడు, శేకూరు ప్రాంతాలలోని గురుబంధువలందరి దృష్టికి తీసుకొని వెళ్ళి ఆహ్వానించినాము. తెనాలి పట్టణములో, కొత్తపేట, గంగానమ్మపేట, నందులపేట, రామలింగేశ్వరపేటలలో జరిగే సత్సంగాల కేంద్రాలకు వెళ్ళి వారందరిని ఈ ఉత్సవములో పాలు పంచుకోవల్సిందిగా ప్రార్థించినాము. అందరు ఒక్క పందిరి క్రిందకు వచ్చి కార్యభారమును వహించి ఆనంద పరవశులైనారు.

మమ్మందరిని అలరింపచేయుచు, ఆనందింపచేయుచు, బాబా అనుగ్రహానికి పాత్రులను చేయిస్తున్న "గురూజీ" కి ఇష్టమైన రీతిలో ఈ కార్యక్రమముండాలని కార్యకర్తలైన గురుబంధువులందరు ఏకాభిప్రాయంగా అన్నారు. ఉడుతాభక్తిగానే తమవంతు కార్యక్రమాన్ని విజయవంతంచేసారు. ఈ "ఏధ" కంతటికి మూలస్తంభము గురూజీయే.

సాధకుని కలకు, గురుదేవుల అనుగ్రహానికి ప్రతిబింబముగా, రూపురేఖలు దిద్దుకొనిన శుభదినమది. కలలుకల్లలని, అవి ఇలలో జరగనివి అని పలికే జనులకు "కలలు కల్లలన చెల్లదు ఇలలో గుర్వనుగ్రహానికి పాత్రులున వారి విషయములో" అనే సత్యము మా అందరికీ అనుభవమైనది. చిత్ర రూపములో కనిపించిన రూపానికి జీవము వచ్చి కదలిక ప్రారంభమైనది. అందరిలోను ద్విగుణీకృత ఉత్సాహం ఉరకలు వేయసాగినది.

98 జనవరి 10 రాత్రినుండే ఉదయ శంకర కళ్యాణ మండపంలో ఏర్పాట్లు ప్రారంభమైనాయి. తెల్లారేసరికి ముస్తాబు పూర్తియైంది. 'స్టేజీని' యధాశక్తి అలంకరించాము.

జనవరి 11, ఉదయం 8.30 గం|| బాబా, గురుదేవుల చిత్రపటాలుంచబడినవి. ఊరేగింపుకు అందంగా అలంకరించి వెనుక భాగమందు "సాయి బాబా నామం" ఊరేగింపు పూర్తియయ్యేంతవరకు ఏర్పాటు చేసాము.

ఊరేగింపు ప్రారంభం కానుంది. గురు ప్రాముఖ్యతను వివరించు బ్యానెర్సును గురుబంధువులు పట్టుకొనినారు. "మానవజాతి అనే అధ్యాత్మిక మహోన్నత వృక్షానికి పండిన ఫలమే శ్రీశరద్బాబూజీ." "సద్గురుని రూపమెలా వుంటుంది, సాయినాథుని శరద్బాబూజీలా వుంటుంది" "సద్గురు సాయినాథుని సన్నిధి ఇహపరములకు పెన్నిధి." "రాసుల కొలది సంపదుంది. తాళములేని ఖజానా గురునిధి. ఎందరైనను తీసికొనవచ్చు. కాని గ్రహించు వాడేడి." "మాయమరగిన చిత్తమా గురునామమందు రమించుమా! కలలోని కలవరింతైనను గురునామమమునే అనుము." అన్నట్టి బ్యానర్స్ చూపరులను ఆనందపర్చినవి.


ఎఱ్ఱని దుస్తులు ధరించిన 30 మంది మేళగాళ్ళు, వారి వెనుక కోలాటము, మా సత్సంగపు గురుబంధువులు బాబా నామం చెప్పారు. వారి వెనుక బారులు తీరిన సాయినాథుని భక్త బృందము, బుట్టిపాలెం, జాగర్లమూడి, అంగలకుదురు, తదితర ప్రాంతమునందలి సత్సగ కేంద్రాలవారు 200 మంది ఈ ఉత్సవంలో పాల్గొనినారు. వారికి వెనుక భాగాన బాబా, గురుదేవుల పటాలుంచిన వాహనం చూడ ముచ్చటగా, ఆనందోత్సాహాలు, వెల్లుబకగా, బాబా నామ స్మరణంతో ఊరేగింపు మెల మెల్లగా బయల్దేరింది. నాటి శిరిడీలోని చావడి ఉత్సవాన్ని జ్ఞప్తికి తెస్తున్నట్లుగా తెనాలిలోని పురవీధులను పరవశింపజేస్తూ 1-30గం|| కు మళ్ళీ కళ్యాణ మండపమునకు చేరినది. నాలుగు కూడలి ప్రాంతములు వచ్చిన చోట్లల్లా మా గురుబంధువులు అత్యుత్సాహంతో కోలాటం చిందులు వేస్తూ బాబా నామాన్ని అంటుంటే దిక్కులు పిక్కటిల్లినవి. వారికా సమయంలో గురుదేవులు, బాబా పూని వుంటారు. లేకుంటే వారికి అంతటి శక్తి ఎలా లభ్యమైంది. తెనాలి పట్టణవాసులు ఈ వైభవాన్ని ఆనందోత్సాహాలతో తిలకించారు.

కళ్యాణ మండపంలో 1500 మందికి భోజన ఏర్పాట్లు సాధు సంతర్పణమను పేరిట జరిగింది. 4గం|| భజన కార్యక్రమాన్ని "గురునాధంగారు" వారి మిత్రమండలి నిర్వహించింది. ఈ మధ్య శిరిడీలోని వివిధ సన్నివేశాలను చక్కని ఛాయా చిత్రముల ద్వారా "రత్తయ్యగారు" తెనాలి గురుబంధువులకు ఈ సందర్భంగా తిలకించేందుకు "గురుజీ ఛాయా చిత్ర దర్శన్" అను పేరిట "Exbibition" ఏర్పాటు చేసినారు. దీనివల్ల 97 విజయదశమిన శిరిడీలోని వివిధ సన్నివేశాలని శిరిడి వెళ్ళలేని గురుబంధువులు చూడగలిగే అవకాశం కల్గింది.

4గం|| నుండి 6గం|| వరకు గురుబంధువులు, తమ తమ అనుభవాలను సత్సంగంలో ముచ్చటించారు. వారిలో వెంకట నారాయణగారు, రమాలక్ష్మి, రత్నకుమారి, రత్తయ్యగారు, డా|| రామమోహనరావు, కోటేశ్వరరావు, లక్కరాజు, నరశింహరావు మొదలగు గురుబంధువులు ఉన్నారు.

అనంతరం హారతి కార్యక్రమంతో కార్యక్రమం దిగ్విజయంగా గురుదేవుల అనుగ్రహంతో నెరవేరింది. మొత్తం మీద ఇది "సత్య స్వప్నేష".





శ్రీ గురుభ్యోనమః

# గృహప్రవేశ

## ఆహ్వానము

పిలచిన పలికే దైవం శ్రీ సాయిబాబా అపార కృపతో,

మమ్ము సదా కంటికిరెప్పలా కాపాడే మా గురుదేవులు

పూజ్యశ్రీ సాయినాథుని శరత్ బాబూజీ

చల్లని దీవెనలతో నర్మించుకున్న

"సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ సన్నిధి"

ప్రవేశ సందర్భంగా తామెల్లరు విచ్చేసి మమ్మాశీర్వదింప ప్రార్థన.

| | | |
|---|---|---|
| తేది | : | 12--2-1998 గురువారం |
| కార్యక్రమము | : | ఉదయం గం\|\| 8-00లకు<br>సద్గురు శ్రీ సాయినాథిని శరత్ బాబూజీ<br>ఆశ్రమము నుండి బాబా- బాబూజీల<br>చిత్రపటములతో నగరోత్సవం.<br>ఉ\|\| గం\|\| 10-00 లకు పూజ<br>ఉ\|\| గం\|\| 10-30 లకు సత్సంగము, భజన<br>ఉ\|\| గం\|\| 12-00 లకు ఆరతి,<br>ప్రసాద వినియోగము. |

ఇట్లు

**జ్ఞనగారి నాగేశ్వరరవు - వసంత**

**అన్వేష్ - రాకేష్**

9 - 180, బలుమూరివారి సందు
తూర్పువీధి, వెంకటగిరి
ఫోను:67322